ప్రజాశక్తి
ఆదివారం 10 మార్చి 2024 5 శ్రీ సత్యసాయి

సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి, పాల్గొన్న నాయకులు

అపార సంపదలున్నా.. సమస్యలే..!

అభివృద్ధికి ఆమడదూరంలో రాయదుర్గం

పట్టించుకోని ప్రభుత్వాలు, పాలకులు

ఎన్నికల హామీలకే పరిమితమైన అభివృద్ధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కర్నాటక సరిహద్దుల్లో ఉండే రాయదుర్గం నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. రాష్ట్రంలోనే ఎక్కడాలేనంతగా అపారమైన ఖనిజ సంపదున్నా అభివృద్ధికి మాత్రం ఆమడదూరంలోనే ఉంది. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా అక్కడి ప్రజల పేదరికం, దారిద్ర్యం మాత్రం మారడం లేదు. ఉపాధి కోసం పొట్టచేతపట్టుకుని పక్క రాష్ట్రానికి వలసలు తప్పడం లేదు. ఎన్నికల సమయంలో మాత్రం ప్రతిసారీ హామీలపై హామీలు వస్తూనే ఉన్నాయి.

రాయదుర్గం నియోజకవర్గంలోని ఖనిజసంపద

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

కనిపించని కుదురేముఖ్

రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని డీ.హీరేహాళ్ మండలంలో అత్యంత విలువైన ఇనుప ఖనిజం ఉంది. ఈ ఖనిజాన్ని దోపిడీ చేసి వేల కోట్ల రూపాయలకు అధిపతులైన వారు కళ్లముందే ఉన్నారు. కాని ఈప్రాంతవాసులకు చేకూరిన ప్రయోజనం మాత్రం శూన్యమనే చెప్పాలి. ఈ ఖనిజ సంపద ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి కాకుండా ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని జిల్లావాసులు కోరుతున్నారు. అందుకు అనుగుణంగా 2012లో ఎపిఎండిసి, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్, కుదురేముఖ్ మూడు ప్రభుత్వ రంగ సంస్థలు కలిపి ఈ ఇనుప ఖనిజాన్ని తవ్వి ఉక్కు గుండ్లను తయారు చేయాలని నిర్ణయించి, ఒప్పందం జరిగింది. దీని ఏర్పాటు పూర్తయితే మూడు వేల మందికి ఉపాధి లభిస్తుందని కూడా ఆ ఒప్పంద సమయంలో ప్రకటించారు. మూడు సంస్థలు ప్రభుత్వరంగ సంస్థలు కావడంతో దోపిడీకి అవకాశం లేకుండా ప్రజలకు మంచి జరుగుతుందని ఆశించారు. కాని ఆ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అటకెక్కింది. ఇప్పటి వరకు దాని గురించి పట్టించుకున్న వారు లేరు. పైగా ఇప్పుడు ఆ ఇనుప గనులను జిందాల్ సంస్థకు కట్టబెట్టేందుకు వైసిపి ప్రభుత్వం చర్యలు చేపడుతుండటం గమనార్హం.

కాగితాలకే పరిమితమైన ఉంతకల్లు రిజర్వాయరు

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కింద కణేకల్ చెరువుకు పై భాగంలో నీటిని నిలువ చేసేందుకు ఐదు టిఎంసిలతో ఉంతకల్లు రిజర్వాయరును నిర్మించే ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. ఇది కూడా 2014 తరువాత టిడిపి హయాంలో ప్రకటన అయింది. డిపిఆర్‌కు ఆదేశాలిచ్చామని ప్రకటించారు. కాని పూర్తవలేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ముందుకు సాగలేదు. దీంతో ఉంతకల్లు రిజర్వాయర్ కూడా ఎన్నికల హామీ ప్రకటనలాగానే ఉండిపోయింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే నీరు ఎక్కువ వచ్చిన సమయంలోగాని, తక్కువగానున్న సమయంలోగాని రాయదుర్గం నియోజకవర్గం పరిధిలోని ఆయకట్టుకుని నీటిని నిలువ చేసుకుని పంటలకు నీటిని అందించేందుకు అవకాశముంటుంది. కాని రెండు ప్రభుత్వాల హయాంలోనూ ఇది ప్రకటనలకే పరిమితమైంది.

ఆగని వలసలు

పాలకులు మారుతున్నా ఈ ప్రాంతవాసులకు ఉపాధి కోసం వలసలు తప్పడం లేదు. స్థానికంగా పది మందికి ఉపాధి కల్పించే పరిశ్రమ ఏదీ లేకపోవడంతో వలసలు అధికంగా ఉంటున్నాయి. సాగునీటి వసతివున్నా నిర్వహణపై పాలకులు దృష్టి సారించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఈ నియోజకవర్గంలోని కణేకల్, బొమ్మనహాళ్ మండలాల్లో పోతున్నా ఆధునీకరణ అర్ధాంతరంగా ఆపడంతో ఆయకట్టు రైతులకు ఇబ్బందులున్నాయి. ఇప్పటికైనా ఈ ప్రాంతాభివృద్ధిపై పాలకులు నిర్దిష్టమైన ప్రణాళికలను విడుదల చేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

అటకెక్కిన భైరవానితిప్ప ప్రాజెక్టు

ఈ నియోజకవర్గం పరిధిలోనున్న భైరవాని తిప్ప ప్రాజెక్టుకు హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని అందిస్తామని 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రకటించి టెండర్లు ఆహ్వానించింది. పనులు మొదలైనప్పటికీ వారి హయాంలో పూర్తి చేయలేకపోయారు. 2019 ఎన్నికల సమయంలో ఈ ప్రాజెక్టును తాము పూర్తి చేస్తామని వైసిపి ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రాయదుర్గం వచ్చిన సమయంలోనూ హామీనిచ్చారు. కాని ఆచరణలో మాత్రం పనులు ముందుకు సాగలేదు. నీరు చేరలేదు.

టిడిపి, బిజెపి, జనసేన పొత్తుతో ఒరిగేదేమీ లేదు : మంత్రి

ప్రజాశక్తి -పెనుకొండ

నాడు మోదీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన చంద్రబాబు నేడు బిజెపితో జత కట్టడంపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మంత్రి శనివారం పట్టణంలోని 9వార్డులో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ముందుగా మంత్రికి వైసిపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఆమె వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించా రు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ మోదీతో పొత్తు పెట్టు కుంటున్నాడండే చంద్రబాబు ఉనికి ఎక్కడ అని ప్రశ్నించారు. పొత్తులో భాగంగా పవన్ కళ్యాణ్‌ని ఎంపిగా పంపిస్తున్నారంటే చంద్రబాబు కుట్ర రాజకీయాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థమవుతాయన్నారు. సిఎం పదవికి అడ్డం వస్తాడేమోనని భయంతోనే ఆయన్ను ఎంపికి పంపుతున్నరని, ఆ విషయాన్ని పవన్ కళ్యాణ్ అర్థం చేసుకోవాలని హితవు పలికారు. టిడిపి, జనసేన, బిజెపి ఏకమై వచ్చినా జగన్ సింగిల్‌గా వస్తారని తెలిపారు. ప్రతి గడపలో వైసిపికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. పూర్తి మెజారిటీతో మరోమారు జగన్ సిఎం అవుతారన్నారు. జగన్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని, చంద్రబాబు తన పాలనలో ఏమి చేశారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. పెనుకొండలో జరిగిన చంద్రబాబు, లోకేష్ సభలకు జనాలు లేక ఫెయిల్యూర్ అయ్యాయన్నారు. పొత్తులతో చంద్రబాబుకు ఒరిగేదేమీ లేదని, వార్ వన్ సైడ్ అన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ ఉమర్‌ఫరూక్, వైస్ ఛైర్మన్ సునీల్, కౌన్సిలర్ శ్రీరాములు, సుధాకర్‌రెడ్డి, గణేష్, రఘునాథరెడ్డి, తయూబ్, బోయ బాబు, సద్దాం, శేషాద్రి, రామంజి, యాసిన్, టౌన్ కన్వీనర్ నరసింహా, నాయకులు శంకర్‌రెడ్డి, కొండల రాయుడు, వెంకటేష్, గోపాల్, రాజశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలయ్య హ్యాట్రిక్ విజయం ఖాయం : టిడిపి

ప్రజాశక్తి-హిందూపురం

సైకో పదానికి నిలువెత్తు నిదర్శనం సిఎం జగన్ అని, సైకో విధానాల వల్ల రాష్ట్రం అధోగతి పాలైందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసంలో శనివారం మున్సిపల్ మాజీ ఛైర్మన్ జెవి.అనిల్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట అంజనప్ప, పట్టణ అధ్యక్షులు డి.రమేష్ కుమార్, కౌన్సిలర్ సతీష్ కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును 75 శాతం పూర్తిచేస్తే వైసిపి ప్రభుత్వం మిగిలిన 25 శాతం పనులు పూర్తి చేయకుండా రివర్స్ టెండర్ విధానం ద్వారా రాయలసీమకు నీళ్లు రాకుండా చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు అన్న క్యాంటీన్ల ద్వారా పేదల ఆకలి తీర్చగా జగన్ రద్దు చేసి పేదల కడుపు కొట్టారన్నారు. హిందూపురం పట్టణ ప్రజల ఇబ్బందులను గమనించిన ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకొని గొల్లపల్లి ప్రాజెక్టు నుంచి నేరుగా హిందూపురానికి నీటిని తీసుకొచ్చారన్నారు. పట్టణ అభివృద్ధికి రూ. 66 కోట్లు తీసుకొస్తే ఆ నిధులను రద్దు చేసిన నీచచరిత్ర వైసిపి నాయకులదని దుయ్యబట్టారు. కనీసం వార్డు స్థాయిలో గెలవలేని నాయకులు ఎమ్మెల్యే బాలయ్య, నారా లోకేష్ పై అవాకులు చెవాకులు పేలడం సిగ్గుచేటు అన్నారు. బాలకృష్ణ మరోమారు గెలిచి హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. ప్రజా ప్రయోజనాలను పట్టించుకోని వైసిపి ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో నాయకులు భాస్కర్, నెట్టప్ప, అమర్నాథ్, రామాంజనమ్మ, పరిమళ, వెంకటరమణ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు

పదవుల కంటే కార్యకర్తలే ముఖ్యం : పరిటాల శ్రీరామ్

నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పదవులు, భవిష్యత్తు కంటే నన్ను నమ్మి నా వెంట నడిచిన కార్యకర్తలే తనకు ముఖ్యమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ధర్మవరంలో పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నేను ఇక్కడికి వచ్చినప్పుడు ప్రతి నాయకుడు, కార్యకర్త నా వెంట ఉండి నడుస్తూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారన్నారు. వైసిపి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అనేక రకాలుగా ధర్నాలు, ఆందోళనలు, దీక్షలు చేశారన్నారు. పోలీసులు అక్రమ కేసులు బనాయించినా భయపడకుండా నా వెంట నడిచారన్నారు. కావున మీ కోసం ధర్మవరంలో ఉంటూ అండగా ఉంటానన్నారు. ధర్మవరం బాధ్యతలను అప్పగించిన నారా లోకేష్‌పై తనకు నమ్మకం ఉందని, టిడిపి గెలుపే లక్ష్యంగా పని చేద్దామని పిలుపునిచ్చారు.

సచివాలయాల ద్వారా గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి-బుక్కపట్నం

సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సిద్ధరాంపురం గ్రామంలో రూ. 43 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సచివాలయాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. వైసిపి ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా ప్రజా పాలన సాగిస్తుందని తెలిపారు. అనంతరం ఆర్‌బికె, విలేజ్ హెల్త్ క్లినిక్‌ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి వెంకట రమణయ్య, ఎంపిపి శ్రీధర్‌రెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, కన్వీనర్ సుధాకర్ రెడ్డి, ఎంపిటిసి చెన్నమ్మ, మల్లేష్, కేశప్ప, మాధవరెడ్డి, నేలకోటప్ప తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

టిడిపి సీనియర్లతో మాజీ ఎమ్మెల్యే భేటీ

ప్రజాశక్తి-అమరాపురం

మండలంలోని టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మండల కన్వీనర్ శివరుద్రప్ప, మాజీ జడ్పిటిసి, జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి, మాజీ ఎంపిపి కృష్ణమూర్తిలను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ నాయకులను కలవడం ఆనందంగా ఉందన్నారు. అగళి మాజీ జడ్పిటిసి రామకృష్ణ యాదవ్‌ను కలిసి నియోజకవర్గంలో వర్గ విభేదాలను పక్కనపెట్టి మండలంలోని నాయకులు కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో అభ్యర్థి సునీల్‌కుమార్ విజయం ఖాయమని, చంద్రబాబు సిఎం కావడం తథ్యమని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కంచితి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప, రవిభూషణ్, ఉగ్రనరసింహప్ప, రవికుమార్, రామన్న, భోజన్న, చంద్రశేఖర్, దాదాపీర్, ఆదినారాయణ, హనుమంతరాయ, నాగరాజు, కెంచప్ప, తదితరులు పాల్గొన్నారు.

వాడీ వేడి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మార్చి ప్రారంభంలోనే వాతావరణం ఒక్కసారిగా వేడెక్కుతోంది. మొదటి వారంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎండ వేడిమి 40 డిగ్రీలకు దాటింది. హిందూపురంలో ఒక మహిళ రేషన్‌షాపుకెళ్లి వడదెబ్బకు మృతి చెందింది. జిల్లాలో ఈ ఏడాది మొదటి వడదెబ్బతో మృతి చెందిన కేసుగా చెప్పవచ్చు. ఇంక ఏప్రిల్, మేల్లో ఇంతకెంత తీవ్రంగా ఎండ ఉంటుందో అని ఊహించుకుని జనం భయపడిపోతున్నారు. ఇదే సమయంలో ఎన్నికలు కూడా రావడంతో రాజకీయ వాతావరణం కూడా వేడెక్కుతోంది. ఇప్పటికే ఆయా పార్టీలు పోటీ చేసే స్థానాలతోపాటు ఇప్పటికే కొంత మంది అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ ఖరారు చేసిన చోట అసంతృప్తులు, అలకలు ఒకవైపు ఉంటున్నాయి. ఈ వారంలో చూసినప్పుడు టిడిపి ఇటువంటివి కనిపించాయి. మడకశిర, కళ్యాణదుర్గం, శింగనమల నియోజకవర్గాల్లో అసంతృప్త నేతలు బాహాటంగా బయటకు తమ అసంతృప్తిని వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. అయితే ఇదే సమయంలో జిల్లాలో ఒకవైపు టిడిపి నాయకురాలు భువనేశ్వరి నిజం గెలవాలి పేరుతో పర్యటన చేపట్టింది. ఇది ముగియక ముందే నారా లోకేశ్ జిల్లాకు వచ్చారు. శంఖారావం పేరుతో ఆయన పర్యటన చేపడుతున్నారు. ఆయన ఈ వారమంతా ఇక్కడే మకాం వేశారు. రోజుకు రెండు నియోజకవర్గాల కంటే ఎక్కువగానే పర్యటిస్తున్నారు. ఇదే సమయంలో అసంతృప్త నేతలతోనూ చర్చిస్తూ సమస్యను కొలిక్కి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో చాలా వరకు సర్దుబాటు దిశగా వస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఇది నేతల ముందు వరకేనా తరువాత కూడా ఉంటాయా అన్న అనుమానం కలుగుతోంది. ఇది ఇలాగుంటే టిడిపి ,జనసేన, బిజెపి పొత్తు అంశం రాజకీయ వేడిని మరింత పెంచుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం, ధర్మవరం నియోజకవర్గాలకు పొత్తుల్లో భాగంగా టిడిపి వదులుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఆ నియోజకవర్గాల్లోనూ కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక కర్నూలు జిల్లా నాయకులు, మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం టిడిపిలో చేరడంతో ఆయన గుంతకల్లులో పోటీ చేస్తారన్న ప్రచారం నడుస్తోంది. దీంతో అక్కడా కొత్త అసంతృప్తులు మొదలయ్యాయి. ఇలా టిడిపిలో జరుగుతున్న పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. ఇక వైసిపి వేచి చూసే ధోరణే అవలంభిస్తోంది. ముందే అభ్యర్థుల ప్రకటన ప్రారంభించినప్పటికీ ఇప్పటి వరకు ఏడు నియోజకవర్గాల్లోనే పూర్తి చేసింది. ఇంకా సగం నియోజకవర్గాల్లో ప్రకటించాల్సుంది. ఇక్కడ ఎటువంటి మార్పులుండనున్నాయన్నది చర్చ నడుస్తోంది. ఏదైనా మార్పులు జరిగితే ఈ నియోజకవర్గాల్లోనూ అసంతృప్తులు మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రకటించిన వాటిల్లోనూ వైసిపి మార్పు చేస్తుందన్న ప్రచారం నడుస్తోంది. ఇది ఎంతవరకన్నది తెలియదు. మొత్తంగా వాతావరణంతోపాటు రాజకీయ వేడి క్రమక్రమంగా పెరుగుతోంది. ఇది రాబోయే రోజుల్లో మరింతగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇది ఇలాగుంటే సిపిఎం జిల్లా సమగ్రాభివృద్ధి అంశాన్ని ముందుకు తీసుకొచ్చింది. జిల్లా సమగ్రాభివృద్ధి ప్రణాళికను ఆయా పార్టీల నాయకులు, అభ్యర్థులకు అందజేస్తోంది. వ్యక్తిగతంగా అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి నాయకులకు, ఇతర పార్టీల ముఖ్యులకు కూడా ఈ ప్రణాళికను అందజేస్తోంది. ఈ అంశాన్ని అజెండాపైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తోంది.

రథోత్సవ వేడుకల్లో 'ప్రొటోకాల్' వివాదం

ఆలయ ఛైర్మన్, ఈవో తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ప్రజాశక్తి-హిందూపురం

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన లేపాక్షి ఆలయంలో శివరాత్రి వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవ వేడుకల్లో ప్రోటోకాల్ వివాదం చోటుచేసుకుంది. బ్రహ్మోత్సవ వేడకల్లో భాగంగా శనివారం బ్రహ్మ రథోత్సవ వేడుకలు జరిగాయి. వేడుకల సందర్భంగా గ్రామ సర్పంచితో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులకు, గ్రామ పెద్దలకు సమాచారం అందించి, వారందరు వచ్చిన అనంతరం ఆలయంలో స్వామి వాకిరి ప్రత్యేక పూజలు నిర్వహించి, వచ్చిన పెద్దలను సన్మానించిన అనంతరం రథోత్సవం ప్రారంభించడం ఆనవాయితీ. అయితే శనివారం జరిగిన కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్, ఈవో కలిసి ఎవరికీ కనీస సమాచారం లేకుండా కార్యక్రమాలు చేశారని అధికార పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సర్పంచి, ఎంపీటీసీ, జడ్పిటిసి, మండల వైసీపీ కన్వీనర్ ఇతర నాయకులు హాజరు కాకున్నప్పటికీ రథోత్సవం వేడుకలు నిర్వహించారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని తమకు అవమానం చేస్తారంటూ అక్కడే ఉన్న దేవాదాయ శాఖ ఈవో నరసింహమూర్తి పై దాడి చేయడానికి స్థానికులు ప్రయత్నించారు. ప్రోటోకాల్ విషయాన్నిసంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని వైసిపి నాయకులు తెలిపారు.

ఆలయ ఛైర్మన్, ఈవోలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి www.prajasakti.com

వైద్య శిబిరంలో రోగులకు చికిత్స అందిస్తున్న వైద్యులు

వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

పెనుకొండ : పట్టణంలో వెలసిన బాబయ్యస్వామి దర్గా పీఠాపతి తాజ్‌బాబా, కాబోయే పీఠాధిపతి నజర్ హుస్సేని ఆధ్వర్యంలో డాక్టర్ సయ్యద్ తౌఖీరా తబస్సుమ్ అధ్యక్షతన బెంగళూరుకు చెందిన సప్తగిరి హాస్పిటల్ సహకారంతో శనివారం పట్టణంలోని దర్గాపేటలో పెద్ద దివాన్ ఖానా వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గుండె, న్యూరో సర్జరీ, కిడ్నీ స్టోన్, క్యాన్సర్ సంబంధింత వ్యాధులకు వైద్య సేవలందించి మందులు ఇచ్చారు. 20 మందిని శస్త్రచికిత్స కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. శిబిరంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, హిందూపురం పట్టనానికి చెందిన టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారుఖ్ ఖాన్, బాబా, అహ్మద్ హుస్సేన్, షేక్షా, జింకా నూర్, దాదు, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

బత్తలపల్లి : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ 6, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 12 నుంచి ఏప్రిల్ 11వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఇఒ సుధాకర్‌నాయక్ తెలిపారు. బత్తలపల్లిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్(బడి మానేసిన వారు), పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బిపిఎల్ బాలికలు మాత్రమే అర్హుల న్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు. సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చు అన్నారు. మరిన్ని వివరాలకు టోల్ నెంబర్ 180042 58599ను సంప్రదించాలన్నారు. ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు రూ. 1.2లక్షలు, పట్టణ ప్రాంత విద్యార్థులకు రూ. 1.4లక్షల మించకూడన్నారు.

12న మెగా జాబ్‌మేళా

పుట్టపర్తి అర్బన్ : నిరుద్యోగ యువత కోసం ఈ నెల 12వ తేదీ బుక్కపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్య అభివృద్ధి శాఖ జిల్లా అధికారి అబ్దుల్ ఖయ్యూం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో 15 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటార న్నారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ చేసిన యువతీ, యువకులు 18-30 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్, బెంగళూరు, తిరుపతిలో ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. వేతనం నెలకు రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకూ ఉంటుందిన్నారు. ఇంటర్వ్యూకు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని, బయోడేటాతో పాటు ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు 79815 41994 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

హెంజేరు సిద్ధేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే

అమరాపురం : ప్రసిద్ధ హేమావతి హెంజేరు సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన భాను పల్లకి ఉత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పాల్గొని స్వామివారిని దర్శించుకు న్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆలయ కమిటీ సభ్యులను ఆదేశించారు. పోలీసు బందోబస్తుపై ఆరా తీశారు. గున్నేపల్లి రహదారికి ఇరువైపులా ఉన్న కంప చెట్లను దగ్గరుండి తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే వెంట జడ్పిటిసి సారక్క నరసింహమూర్తి, సర్పంచి తిప్పేస్వామి, ఆలయ కమిటీ ఛైర్మన్ మంజునాథ్, బిడి నరసింహమూర్తి ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగప్ప

టిడిపి, జనసేన బిసి డిక్లరేషన్‌పై హర్షం

ప్రజాశక్తి-మడకశిర

అన్ని రంగాల్లో వెనుకబడ్డ కుంచితి వక్కలిగల అభివృద్ధి కోసం టిడిపి, జనసేన ఉమ్మడి పార్టీలు ఉమ్మడిగి బిసి డిక్లరేషన్ ప్రకటించడం హర్షణీయమని రాష్ట్ర కుంచితి వక్కలిగ సాధికారత సమితి అధ్యక్షులు విఎం పాండురంగప్ప హర్షం వ్యక్తం చేశారు. రొళ్ల మండలంలోని వన్నారన్నపల్లి అధ్యక్షులు నివాసం ఆవరణలో శనివారం నియోజకవర్గంలోని కుంచితి వక్కలిగలు సమావేశమయ్యారు. పాండు రంగప్ప మాట్లాడుతూ టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం వస్తే కుంచితి వక్కలిగలను ఒబిసి జాబితాలోకి చేర్పించడం, యువత ఉపాధి కోసం పరిశ్రమలు ఏర్పాటు చేయడం, స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాల ద్వారా శిక్షణ, బిసి డిక్లరేషన్ ప్రకటించడం శుభపరిణామమన్నారు. బిసి డిక్లరేషన్ ప్రకటనతో సిఎం జగన్ గుండెల్లో రైళ్లు పరుగెత్తడం ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో వీరాక్యాతరాయ, ఉగ్రనరసింహా, జయరాంరెడ్డి, టిడి పల్లి మంజునాథ్‌గౌడ్, జయరామప్ప, రామన్న, రవికుమార్, రామచంద్రప్ప, తిమ్మేగౌడ, హనుమంతరాయ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

9 గంటలు నిరంతర విద్యుత్తు సరఫరా చేయాలి

హిందూపురం : వ్యవసాయ రంగానికి 7 గంటల నుంచి 9 గంటలకు విద్యుత్ సరఫరాను పెంచి, పగటి వేళ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని అఖిల భారత రైతు వ్యవసాయ కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ట్రాన్స్‌కో ఎడిఇ నాగన్నకు ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు రంగనాయకులు, సంజీవప్ప, కమిటీ సభ్యులు రవీంద్ర, నాగిరెడ్డి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సరఫరా చేసే విద్యుత్ 7 గంటలకు కుదించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రి సమయాల్లో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా చేస్తుండటంతో రైతులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వారితో పాటు రైతులు ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం : డీఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించు కొనేందుకు, ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు శనివారం పట్టణంలో కేంద్ర పోలీసు దళాలు, సివిల్ పోలీసులతో కలిసి కవాతు నిర్వహించినట్లు డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో సాయంత్రం డీఎస్పీ ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు, సివిల్ పోలీసులు కవాతు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు సిఐఎస్ఎఫ్ సెంట్రల్ పోలీస్ ఫోర్స్ భద్రత భరోసా ఉంటుందని తెలియజేసేందుకు ఈ కవాతు నిర్వహించామన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని, ప్రజలు అపోహలకు గురి కావద్దని, ప్రతి ఒక్కరికీ రక్షణ కల్పించాల్సిన బాధ్యత

హిందూపురంలో కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహిస్తున్న డిఎస్‌పి, సిఐలు

పోలీసులదేనని తెలిపారు. ప్రజలందరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ రియాజ్ అహ్మద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రఘువీరా పర్యటనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మడకశిర

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో త్వరలోనే సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పర్యటిస్తారని విజయవంతం చేయాలని డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధాకర్ పిలుపునిచ్చారు. స్థానిక శ్రీలక్ష్మీ నరసింహస్వామి కమ్యూనిటీ భవనంలో శనివారం పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ గౌడప్ప ఆధ్వర్యంలో మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథి సుధాకర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీని గెలిపిస్తే మడక శిరకు పూర్వ వైభవం వస్తుందన్నారు. నిలిచిపోయిన అభివృద్ధి పనులు, రైల్వేలైన్, రైతులకు హంద్రీనీవా కాలువ ద్వారా సాగునీరు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం 1600 ఎకరాల భూమిని రైతుల నుంచి కొనుగోలు చేసిందని, అయితే గత పదేళ్లలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ఒక్క పరిశ్రమ కూడా నెలకొల్పలేదన్నారు. అది పూర్తి

సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షుడు సుధాకర్

కావాలంటే రఘువీరారెడ్డితోనే సాధ్యమని, కావున ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బిఎన్.నరసింహమూర్తి, ప్రభాకర్‌రెడ్డి, అన్వర్, సతీష్, జగన్నాథ్, పాండురంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, దాసేగౌడ్, శ్రీరంగప్ప, ముద్దప్ప, రాయుడు, సన్నదాసప్ప, రంగనాథప్ప, రామకృష్ణ, శేషాద్రి పాల్గొన్నారు.

'క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమిస్తే విజయం మీదే'

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు లక్ష్య సాధన కోసం క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమిస్తే విజయం మీ వెంటే ఉంటుందని పాంచజన్య పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు సూచించారు. పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి అనంతరం ఏ కళాశాలకు వెళ్లినా గతంలో చదువుకున్న పాఠశాల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల గౌరవాన్ని పెంచేలా మెలగాలన్నారు. విలువల తో కూడిన విద్య వివేకాన్ని పెంచుతుందని, ప్రతి విద్యార్థి వారు ఎంచుకున్న సబ్జెక్టులపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకొని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. సమయపాలన పాటిస్తూ మంచి మార్కులు సాధించాల న్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకంతో పాటు ఇంటర్ విద్యకు ఆర్థికసాయం అందిస్తామన్నారు. కరస్పాండెంట్ నందకుమార్ మాట్లాడుతూ చదువుతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు.

వీడ్కోలు పలుకుతున్న విద్యార్థులతో పాంచజన్య శ్రీనివాసులు

హెచ్‌ఎం గాయత్రీ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు మీ భవిష్యత్తును నిర్ణయిస్తాయన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన విద్యా సామగ్రిని అందించారు. కార్యక్రమంలో ఎఒ భాస్కర్, సూపరిండెంటెంట్ విజయేంద్ర, ఎహెచ్‌ఎంలు శశికళ, సతీశ్‌కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయులు కీర్తి ప్రియ, ఫ్రాన్సీనా, మంజుల, ప్రేమ్ కుమార్, కార్తీక్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు యువత నాయకులు

తెలుగు యువత ఆధ్వర్యంలో

'నా మొదటి ఓటు చంద్రబాబుకే'

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం పట్టణ కన్వీనర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో 'నా తొలి ఓటు చంద్రబాబుకే' కార్యక్రమం నిర్వహించారు. తెలుగు యువత నాయకులు విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి, వేయించి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి వకాశాలు లేక నిరుద్యోగ యువతీ, యువకులు పక్క రాష్ట్రాలకు వలస వెళ్తున్నారన్నారు. టిడిపి హయాంలో చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించార న్నారు. రాష్ట్ర భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని, యువత వచ్చే ఎన్నికల్లో దొంగలు, దోపిడీదారులకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు ఓబుళరెడ్డి, ప్రధాన కార్యదర్శి మనోహర్, ఉపాధ్యక్షులు వైవి.మురళీచౌదరి, బొల్లి సుధీర్, బాడా మహేష్‌రెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి గణేష్ చౌదరి పాల్గొన్నారు.

సవితమ్మ సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

టిడిపిలో పలువురు చేరిక

పెనుకొండ : పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం పరిగి మండలంలోని శ్రీరంగరాజు పల్లి, పాపిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 13 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలోకి చేరాయి. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ టిడిపి కండువా వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో భాస్కర్, మారు తి, సురేష్, వెంకటేష్, సోమన్న, జి.వెంకటేష్, జయశంకర్, గంగప్ప, శ్రీరాములు, గణేష్, నవీన్, సిద్ధప్ప, రామాంజనేయులు ఉన్నారు. కార్యక్రమంలో పరిగి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారులను అభివృద్ధి చేసిన ఘనత టిడిపిదే

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

రూరల్ మండలంలోని అమగొండపాలెం రహదారిని అభివృద్ధి చేసిన ఘనత టిడిపికే దక్కుతుందని శనివారం జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ సెల్ఫీ ద్వారా ప్రజలకు చూపారు. ఆయన మాట్లాడుతూ ఆ గ్రామానికి వెళ్లడానికి వీలులేని రహదారిని టిడిపి హయాంలో మంత్రి పల్లె రఘునాథరెడ్డి అభివృద్ధి చేశారన్నారు. రాష్ట్రంలో జాతీయ, రాష్ట్ర రహదారులు, జిల్లా, మండల కేంద్రాలను అనుసంధానించే రహదారులను వేగంగా అభివృద్ధి చేశారన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణకు చొరవ చూపించిందన్నారు. భూ సేకరణతో పాటు ఏ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ రహదారుల నిర్మాణం వేగవంతం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి అమ్మినేని కేశవనాయుడు, బేకరీ నాయుడు, సుధాకర్ పాల్గొన్నారు.

రహదారిని సెల్ఫీ ద్వారా చూపుతున్న సామకోటి

మంత్రి, ఎంపిలకు ఘనస్వాగతం

ప్రజాశక్తి-కదిరి టౌన్

అనంతపురం జిల్లా ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులకు దిశా నిర్దేశం చేయడానికి శనివారం రోడ్డు మార్గాన అనంతపురం వెళ్తున్న వైసిపి రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి కదిరి వైసిపి సమన్వయకర్త మక్బుల్ మొటుకుపల్లి వద్ద ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసులురెడ్డి, ఇస్మాయిల్, వజ్రభాస్కర్‌రెడ్డి, సాధిక్‌బాషా, సాదత్ అలీఖాన్, లింగాల లోకేశ్వర్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్లు అజ్జుకుంట రాజశేఖర్‌రెడ్డి, కొమ్ము గంగాదేవి, మున్సిపల్ కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


మంత్రి పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న మక్బుల్, వైసిపి శ్రేణులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వివాహిత దుర్మరణం

ప్రజాశక్తి-బత్తలపల్లి

శైలజ(ఫైల్‌ఫోటో)

ముదిగుబ్బ మండలం సంకేపల్లి గ్రామ సమీపంలోని వీరనారాయణస్వామి పరుషకు ద్విచక్ర వాహనంలో వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఓ మహిళ మృతి చెందిన సంఘటన శనివారం మండలం లోని కట్టకిందపల్లి గ్రామం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెల గ్రామానికి చెందిన పార్నపల్లి మారుతి, శైలజ(29) దంపతులు సంకేపల్లి గ్రామ సమీపంలో జరిగే వీరనారాయణస్వామి పరుషకు ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. వీరు కట్టకిందపల్లి గ్రామం వద్ద వెళ్తుండగా జాతీయ రహదారిపై మరో ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శైలజ తలకు బలమైన గాయాలు కాగా మారుతి స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 వాహనంలో స్థానిక ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించగా శైలజ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు తెలిపారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తూ చిన్నారి మృతి

ప్రజాశక్తి - పరిగి

ఇకిత (ఫైల్‌ఫోటో)

స్థానిక సీతారాంపురం కాలనీలో తమిళనాడు నుంచి వలస వచ్చిన రామ్మూర్తి తిను బండారాల దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడికి భార్య, కూతురు ఇకిత(2) ఉన్నారు. రోజూ దుకాణంలో తినుబండారాలు తయారు చేసేవారు. శుక్రవారం రాత్రి కూడా ఇంట్లో తినుబండారాలు చేయగా మిగిలిన వేడినూనెను పాత్రలో ఉంచారు. ఇఖిత ఆడుకుంటూ వేడిగా ఉన్న నూనెలో కూర్చోవడంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన తల్లిదండ్రు లు వెంటనే అప్రమత్తమై చిన్నారిని హిందూపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తమిళనాడులోని క్రిష్ణగిరి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి మృతిచెందింది. ఈ విషయాన్ని స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా చిన్నారి ప్రమాదవశాత్తూ మృతి చెందినట్లు, తండ్రి రామ్మూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ వెంకటేశులు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్ట్

గాండ్లపెంట : మండలంలోని కటారుపల్లి, బాపనోళ్లపల్లి, తదితర గ్రామాల్లో శనివారం 9 మంది పేకాట జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో పేకాట స్థావరాలపై దాడి చేయగా కటారుపల్లి చివరలో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 8,200, బాపనోళ్లపల్లిలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 3,050 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. దాడుల్లో ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తల మృతికి సంతాపం

కదిరి టౌన్ : పట్టణంలోని మూర్తిపల్లికి చెందిన బేతే సురేంద్ర నాయుడు గుండెపోటుతో మృతి చెందగా నియోజక వర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ శనివారం వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళు లర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూరల్ మండలంలోని పట్నం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కృష్ణప్ప హఠాన్మరణం చెందడంతో వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కందికుంట

ప్రశంసా పత్రం అందుకుంటున్న అంగన్వాడీ కార్యకర్త సంజన

అంగన్వాడీ కార్యకర్తకు ప్రశంసా పత్రం

తలుపుల : విధి నిర్వహణలో భాగంగా చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు మండలంలోని వేపమానిపేట సెక్టార్ ఉబ్బరవాండ్లపల్లి గ్రామానికి చెందిన అంగన్వాడీ కార్యకర్త సంజన అంకిత భావంతో ఉత్తమ సేవలు అందించింది. ఆమె సేవలకు గానూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ పిడి లక్ష్మీకుమారి సంజనకు ప్రశంసా పత్రం అందజేసింది. కార్యక్రమంలో సిడిపిఒ రాధిక, సూపర్వైజర్ నిహారిక, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రూ. 50 వేలు విరాళం అందజేస్తున్న దాతలు

కళ్యాణ మండపం నిర్మాణానికి విరాళం

మడకశిర : రొళ్ల మండలంలోని కాల్వేపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీరంగనాథస్వామి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపానికి శనివారం హెచ్‌టి హళ్లి గ్రామానికి చెందిన చంద్రమ్మ, గోవిందప్ప కుటుంబ సభ్యులు రూ. 50 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు శ్రీరంగప్ప, రాజన్న, తిమ్మప్ప, కాంతరాజు, రమేష్, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా వీరనారాయణస్వామి పరుష

ప్రజాశక్తి-బత్తలపల్లి

మహా శివరాత్రి పర్వదినం మరుసటి రోజు మండలంలోని రామాపురం గ్రామంలో నిర్వహించే వీరనారాయణస్వామి జాతర శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పూజల అనంతరం గ్రామంలో ఊరేగించారు. సమీపంలోని చిత్రావతి నదికి తీసుకెళ్లి ప్రత్యేక అలంకరణ చేశారు. ఎగువగుడి అర్చకులు కప్పల నరేంద్ర, నారప్ప, దిగువగుడి అర్చకులు కప్పల నంద, నారాయణస్వామి, నాగన్న స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. జాతరకు మండలంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చుట్టుపక్కల గ్రామాల రైతులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లను రంగు రంగుల కాగితాలతో సుందరంగా అలంకరించుకుని ఊరేగింపుగా స్వామి వద్దకు చేరుకున్నారు. వీరనారాయణస్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి కానుకలు సమర్పించారు. వీరనారాయణ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు కప్పల నరేంద్ర భక్తులకు భవిష్యవాణి వినిపించారు. జాతర సందర్భంగా ఈ ప్రాంతంలో పలు దుకాణాలు వెలిశాయి. అవాంఛనీయ సంఘ టనలు జరుగకుండా ధర్మవరం రూరల్ సిఐ ఆరోహణరావు ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బంది తో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో సర్పంచి బండి సరస్వతి, ఎంపిటిసి బండి రమణమ్మ, ఉపసర్పంచి బండి సుజాత, నారప్ప, లక్ష్మన్న, రామప్ప, లక్ష్మినారాయణ, కప్పల కారప్ప, పెద్దప్ప, ఎల్లప్ప, నాగన్న, కప్పల పెద్దప్ప, కప్పల సూర్యనారాయణ, వ్యాపారం పెద్దప్ప, బండివీరనారప్ప, ప్రకాష్, రాము, పాల్గొన్నారు.

లేపాక్షిలో బ్రహ్మరథోత్సవం

ఘనంగా బ్రహ్మరథోత్సవం

లేపాక్షి : మహాశివరాత్రి బ్రహ్మరథోత్సవం లో భాగంగా లేపాక్షిలో శివపార్వతులకు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆ తరువాత స్వామి అమ్మవారు ఉత్సవ విగ్రహాల ను రథంలో కొలువుదీర్చి పుర వీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో కేరళ కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. భక్తులు స్వచ్ఛందంగా భోజనాలు, మజ్జిగ, నీరు అందించారు. కార్యక్రమంలో సిఐ ఈరన్న, ఎస్ఐ గోపి, ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందం, ఇఒ నరసింహమూర్తి, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

బుక్కపట్నం : మహాశివరాత్రి పర్వదినం

చిత్రావతి నదిలో పూజలందుకుంటున్న కామాపురం వీరనారాయణస్వామి

పురస్కరించుకొని బుక్కపట్నంతో పాటు పలు గ్రామాల్లో వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక అతి పురాతన కోట వీధిలోని శివాలయంలో ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు చేశారు. సాయంత్రం శివపార్వతుల కళ్యాణోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. స్వామి విశిష్టతను తెలియజేస్తూ కదిరికి చెందిన బృందం భక్తులకు హరికథ ద్వారా వివరించారు. భక్తజనానికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి జాగరణ చేశారు. అన్ని శివాలయాలు శివనామ స్మరణ, భక్తుల సందడితో కిక్కిరిశా యి. బుక్కపట్నం రోడ్డులో ఉన్న శివాలయం, పెద్దగంట శివాలయం, నాగుల కణం వద్ద ఉన్న శివాల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో అభిషేకాలు, భజనలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

భోగసముద్రం చెరువులో..

పెనుకొండ : పట్టణంలోని భోగసముద్రం చెరువులో మహాశివరాత్రి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి మహాధ్యాన యోగేశ్వర మూర్తి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకూ భోగసముద్రం జిల్లా వన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి ఉషశ్రీచరణ్ దంపతులు పాల్గొన్నారు. గతంలో లేని విధంగా ఈ ఏడాది యోగీశ్వరమూర్తి విగ్రహానికి మంత్రి సహకారంతో లేజర్ షో ఏర్పాటు చేయగా ప్రజలు పెద్దఎత్తున తిలకించారు. పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక, నృత్య కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ, పరిపూర్ణానందస్వామి, తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

భోగసముద్రం చెరువులో శివరాత్రి వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఉషశ్రీ దంపతులు

In the Court of the IIIrd Addl. Junior Civil Judge (Excise Court), Anantapurmu.
E.P. No: 215/2018 in O.S. No: 325/2011

Between:
G. Nagappa - Petitioner / D.Hr.
And
Y. P. Kullayamma and Others - Respondants / J.Drs.

Notice J.Dr. No: 1,2,3,4,5,6 and 7

JDr1: Y.P.Kullayamma W/o Y.Nagaseshudu, D.No.26/4/3155, Balaji Nagar, R.P.G.T. Road, Hindupur Town.
JDr2: T.CKullayamma W/o T. Ramanjaneyulu D.No.10/148-38-B, Plot No:76, Balanagar, Sainagar, Hyderabad.
JDr3: A. Krishnamurthy S/o Late A.Muddappa
JDr4: A. Suryanarayana S/o Late A.Muddappa
JDr5: A. Kullayaswamy S/o Late A.Muddappa
All are R|at D.No.26/4/3155, Balajinagar, R.P.G.T. Road, Hindupuramu Town.
JDr6: K. Kumari W/o K.Lingamurthy, D.No.16/6/4, New Bhayanagar, Gooty Road, Anantapuramu.
JDr7: B.Parvathi W/o B.Nagendra, TB Dam, Garladinne Village & Mandal

పై నెంబరు కేసులో J.Drs అయిన మీ హాజరు నిమిత్తం 11-03-2024వ తేది ఉదయం 10-30గం॥లకు వాయిదా వేసినారు. ఆరోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

M.GURUSWAMY, *Advocate, Anantapuramu., Cell: 9701942549*